

లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బూర్గుపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో పీఈటీ, జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో ఖాళీలు ఉన్నాయని, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఉషాకిరణ్ ప్రకటనలో పేర్కొన్నారు. బోటనీ, కెమిస్ట్రీలో ఖాళీల కోసం ఎంఎస్సీ కెమిస్ట్రీ, జీవశాస్త్రం, బీఎడ్, పీఈటీ కోసం బీపెడ్ చేసిన వారు అర్హులన్నారు. 10న పాఠశాలలో ఇంటర్వ్యూలు, డెమోలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 63010130281, 7981718918 నంబర్లలో సంప్రదించాలన్నారు.





ముత్యాల పందిరిపై అనంతపద్మనాభ స్వామి

వికారాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస పెద్ద జాతరలో భాగంగా అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామివారిని ముత్యాల పందిరి వాహనంపై భక్తులు ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. శని, ఆదివారాలు పెద్ద సంఖ్యలో భక్తులు అనంతగిరికి వచ్చే అవకాశం ఉందని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏఓ నరేందర్ తెలిపారు.





పీఎంశ్రీ నిధులు దుర్వినియోగం..

» ప్రధానోపాధ్యాయుడి సస్పెండ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మేడ్చల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పీఎంశ్రీ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన నిజాంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని విద్యాశాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'పీఎంశ్రీ నిధులు గోవిందా!' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో విద్యాశాఖ హైదరాబాద్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రధానోపాధ్యాయుడు పి. రఘునాథ్‌ను శుక్రవారం సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఆ స్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం బాధ్యతలను సీనియర్ ఉపాధ్యాయుడు శేఖర్‌కు అప్పగించారు. ఈ విషయమై పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.





సైబర్ క్రైమ్ రేట్‌ను తగ్గించాలి

» వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సైబర్ నేరాలు గణనీయంగా పెరుగుతున్నాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే పోలీసు సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. జిల్లా పోలీసులకు ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం సైబర్ క్రైమ్, కాల్ డేటా రికార్డు అనాలిసిస్‌పై పోలీస్ శిక్షణ కేంద్రంలో నిపుణులతో ఒక రోజు ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కాల్ డేటా రికార్డు విశ్లేషణ ద్వారా నేరాలను ఛేదించడంలో మరింత వేగం, స్పష్టత సాధ్యమవుతుందన్నారు. జిల్లాలో సైబర్ క్రైమ్ తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలు, ప్రజల్లో ఈ తరహా నేరాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు నాయక్, డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐలు శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్, నాగేశ్‌తో పాటు ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయంలో వందేమాతర గేయాన్ని ఆలపిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి


వందేమాతర గేయాలాపన చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు

జాతీయ గౌరవానికి ప్రతీక వందేమాతరం

» ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో సామూహిక గేయాలాపన

వికారాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతం 150 సంవత్సరాల వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు దేశభక్తి ఐక్యత, జాతీయ గౌరవానికి ప్రతీకగా నిలిచిన ఈ గేయాన్ని సామూహికంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఆలపించారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, ఆర్డీవో, తహసీల్దార్, మునిసిపల్, పోలీస్ స్టేషన్, మండల పరిషత్ కార్యాలయం, జెడ్పీ కార్యాలయాల్లో వందేమాతర గేయాన్ని ఆలపించారు. ఈ వేడుకల్లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డిప్యూటీ కలెక్టర్ చంద్రకిరణ్, డీఆర్‌వో మంగ్లీలాల్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రూ.1.30కోట్ల పార్కు స్థలం స్వాధీనం

» హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు



పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకొని బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

ఘట్‌కేసర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ చౌదరిగూడలోని శ్రీనివాస కాలనీలో ఆక్రమణకు గురైన సుమారు రూ.1. 400 చదరపు గజాల పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకొని చుట్టూ ఫెన్సింగ్, బోర్డును ఏర్పాటు చేశారు. శుక్రవారం హైడ్రా అధికారులు, సిబ్బంది ప్రత్యేక వాహనాల్లో వచ్చి పార్కు స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డు ఏర్పాటు చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. చౌదరిగూడలోని సర్వే నంబర్లు 726, 727, 729లలోని 3.16 ఎకరాల్లో 1975లో లేఆవుట్ చేసి 142 పాట్లు చేశారు. ఇందులో ప్రజాప్రయోజనార్థం ఒక చోట వెయ్యి చదరపు గజాలు, మరోచోట 400 చదరపు గజాలను పార్కు కోసం కేటాయించారు. ఇందులో 400 చదరపు గజాల స్థలాన్ని భూ యజమానులు తిరిగి ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేయగా కాలనీవాసులు ఉద్యమించి ఫిర్యాదులు చేసి పనులను అడ్డుకున్నారు. ఇటీవల హైడ్రా పార్కుల రక్షణకు చర్యలు చేపట్టడంతో శ్రీనివాస్ కాలనీ వాసులు హైడ్రాను ఆశ్రయించారు. దీంతో హైడ్రా, మున్సిపల్ అధికారులు స్పందించి పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ పార్కు స్థలం విలువ రూ.1.30 కోట్లు విలువ చేస్తుంది. హైడ్రా, మున్సిపల్ అధికారుల కృషితో తమ కాలనీలో ప్రజలకు పార్కు సమస్య తీరిందని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హైడ్రా, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కింగ్ వేలం @ రూ.3.51లక్షలు
వేలానికి హాజరైన డీపీవో జయసుధ
మెథడిస్ట్ జాతరకు
భారీగా రానున్న వాహనాలు
5

సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి
ఉత్తర్వులు జారీ చేసిన
పంచాయతీరాజ్ విభాగం
జిల్లాలో ఏడుగురు ఉద్యోగులకు లబ్ధి
5

యూడైస్ అప్డేట్ చేసుకోవాలి

కేశంపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): యూడీఐఎస్(యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్)ని అప్డేట్ చేసుకోవాలని కేశంపేట ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం మండలంలోని కొత్తపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2025-2026కు సంబంధించిన యూడీఐఎస్‌లో పాఠశాలల్లోని వనరులను నమోదు చేయించుకోవాలని సూచించారు. విద్యార్థుల వివరాలు రిజిస్టర్, ఆన్‌లైన్, ఆధార్‌లో ఒకే విధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఏవైనా పొరపాట్లు ఉంటే సరిచేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల వివరాల్లో తప్పులుంటే సరిచేసుకోవాలని తెలిపారు. వీటి ఆధారంగానే ప్రభుత్వం సదుపాయాలు కల్పిస్తుందన్నారు.



పార్కింగ్ వేలంలో డీపీవో జయసుధ

వాహనాల పార్కింగ్ వేలం @ రూ.3.51లక్షలు

ధారూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ధారూరు మెథడిస్టు జాతరకు వచ్చే వాహనాల పార్కింగ్‌కు శుక్రవారం అధికారులు వేలం నిర్వహించారు. ధారూరు స్టేషన్, దోర్నాల్ గ్రామాల పరిధిలోని ఏర్పాటు చేసిన వాహనాల పార్కింగ్ వేలం డీపీవో జయసుధ ఆధర్యంలో కొన సాగింది. వేలం పాటలో ధారూరు స్టేషన్ వాహనాల పార్కింగ్‌కు రూ.3.51లక్షలకు లక్ష్మీనగర్ తండాకు చెందిన శ్రీనివాస్, దోర్నాల్ వాహనాల పార్కింగ్‌ను రూ.70,200కు దోర్నాలతండాకు చెందిన తుక్యానాయక్ దక్కించుకున్నారు.

రూ.5లక్షలకు వేలం పాడినా ఇవ్వలేదు

ధారూరు స్టేషన్ వాహనాల పార్కింగ్ వేలంలో రూ.2వేలు డిపాజిట్ కట్టి అధికంగా పాట పాడినా తనకు ఇవ్వకుండా తక్కువ పాడిన వ్యక్తికి అధికారులు పార్కింగ్‌ను కట్టబెట్టారని గ్రామానికి చెందిన మాన్‌సింగ్ తెలిపాడు. పార్కింగ్‌ను తాను రూ.5లక్షలకు పాడినా రూ.3.51లక్షలకు పాడిన శ్రీనుకు కేటాయించారని ఆరోపించాడు. పార్కింగ్ వేలంపై కలెక్టర్ విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరాడు.

జాతర ప్రాంగణాన్ని సందర్శించిన డీపీవో

ధారూరు క్రిస్టియన్ మెథడిస్టు జాతర ప్రాంగణాన్ని డీపీవో జయసుధ సందర్శించారు. భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి వసతి తదితర అంశాలపై సమీక్షించారు. భక్తులకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

వరి, మక్కల కొనుగోలు కేంద్రాల ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

తాండూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తాండూరు డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం తాండూరులో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ప్రారంభించారు. డీసీసీబీ జిల్లా వైస్‌చైర్మన్ రవీందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎ-గ్రేడ్ ధాన్యానికి రూ.2.389, సన్న రకానికి రూ.2.969 అదనపు బోనస్‌లు రూ.500 ఇస్తామన్నారు. మక్కలకు మద్దతు ధర ఇస్తామని, కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని డీసీఎంఎస్ తాండూరు మేనేజర్ సలాం కోరారు.

పాంబండ ఆలయాన్ని దర్శించిన అదనపు కలెక్టర్

కులకచర్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బండవెల్కిచర్ల పాంబండ ఆలయాన్ని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ దర్శించుకున్నారు. కార్తీక శుక్రవారం కావడంతో ఆలయానికి చేరుకొని రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. సందర్భంగా ఆలయ చైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి అదనపు కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తి తదితరులు ఉన్నారు.

ఎంసీహెచ్‌లో మందుల కొరత లేకుండా చూడాలి

» జిల్లా వైద్యాధికారికి వినతి



డీఎంహెచ్‌వోను కలిసిన తాండూరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, డీసీహెచ్‌వో

తాండూరు, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత లేకుండా చూడటంతో పాటు ఎస్ఎంసియులో బడ్జెట్ కేటాయింపు చేయాలని తాండూరు ఆస్పత్రికి వచ్చిన కాయకల్ప అవార్డు ప్రైజ్ డబ్బులు వెంటనే కేటాయించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పవిత్రను, జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆనంద్, జిల్లా ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ శ్రీకాంత్, ఫార్మాసిస్ట్ సాయిగోపాల్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ తదితరులు విన్నవించారు. ఇందుకు జిల్లా వైద్యాధికారి సానుకూలంగా స్పందించారు.

రోడ్డిలా.. ప్రయాణం ఎలా?



గుంతలమయమైన మర్పల్లి-నీళ్లపల్లి రోడ్డు

బషీరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నవాల్ల మీదుగా పర్వత్‌పల్లి-నీళ్లపల్లి రోడ్డు అధ్వాన్నంగా మారింది. ఈ రోడ్డు మార్గంలోని మర్పల్లి నుంచి నీళ్లపల్లి మలుపు వరకు గల 6కిలోమీటర్ల రోడ్డు పలుచోట్ల గుంతలు పడి వాహనదారులు నిత్యం నరకయాతన పడుతున్నారు. ఈ రోడ్డుపై రాత్రుల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లలేని దుస్థితి ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు బాగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పరుగు పందెంలో విద్యార్థినులు

కొనసాగుతున్న క్రీడాపోటీలు

మేడ్చల్ టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లోని కిష్టాపూర్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న జోనల్‌స్థాయి క్రీడాపోటీల రెండో రోజు శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. రన్నింగ్ ఖోఖో, కబడ్డీ తదితర పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు.



వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న అదనపు కలెక్టర్ రాధికగుప్తా

కలెక్టరేట్‌లో వందేమాతరం గీతాలాపన


మేడ్చల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వందేమాతర జాతీయ గీతాన్ని బంకిం చంద్ర చటర్జీ రచించి 150ఏళ్ల పూర్తి అవుతుందని అదనపు కలెక్టర్ రాధికగుప్తా తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. దేశ భక్తిని, ఐక్యతను చాటడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలతో సీఎం చిత్రం

» రేవంత్‌రెడ్డిపై అభిమానాన్ని చాటుకున్న చిత్రకారుడు

» ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో ఆర్ట్

దౌల్తాబాద్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై ఉన్న అభిమానాన్ని చిత్రకారుడు అశోక్ వినూత్నంగా చాటుకున్నాడు. శనివారం సీఎం జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయనపై ఓ చిత్రాన్ని తీర్చిదిద్దాడు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం యాంకి గ్రామానికి చెందిన అశోక్.. సీఎం తన నియోజకవర్గం కొడంగల్ దశ, దిశ మార్చేలా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో చేపట్టిన పలు ప్రాజెక్టులతో చిత్రాన్ని గీశాడు. ఆయా ప్రాజెక్టులు తలపెట్టిన సందర్భాల్లో రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను ఆ ఆర్ట్‌లో రాశాడు. కొడంగల్ సంక్షేమానికి పాటుపడుతున్న తమ అభిమాన నాయకుడికి కృతజ్ఞతలు చెప్పాలనే తాను ఈ చిత్రాన్ని గీశానని అశోక్ చెప్పాడు.



రేవంత్‌రెడ్డిపై కళాకారుడు సున్నపు అశోక్ రూపొందించిన చిత్రం



వందేమాతర గీతాలాపనలో తూంకుంట పాఠశాల విద్యార్థులు

ప్రజల్లో దేశభక్తిని పెంపొందించాలి

» వందేమాతరం ఉత్సవాల్లో ఎంపీ ఈటల రాజేందర్



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

శామీర్‌పేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎంతో మంది సమరయోధుల ప్రాణత్యాగాలతోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం తూంకుంటలోని జడ్పీ పాఠశాలలో హెచ్ఎం వెంకటొరెడ్డి ఆధ్వర్యంలో వందేమాతర గీతాలాపన ఉత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాజేందర్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ.. ప్రపంచంలో భారత ఆత్మగౌరవాన్ని ఆవిష్కరించాలంటే ప్రజల్లో దేశభక్తిని పెంపొందించాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79ఏళ్లు అయినా మనం భారతీయులం, భారతమాత ముద్దు బిడ్డలం అనే భావన లేకుంటే ఐక్యంగా ముందుకు సాగలేమన్నారు. మనమందరం దేశానికి పునరంకితం కావాలని, ప్రధాని నరేంద్రమోడీ ఇచ్చిన సందేశం మేరకు వందేమాతరం గేయాలాపన చేస్తున్నామని అన్నారు. అనంతరం విద్యార్థులు జాతీయ జెండాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తూంకుంట మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ జ్యోతి, మాజీ సర్పంచ్ నాగేష్‌యాదవ్, నాయకులు జాతీయ జెండాను ప్రదర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు చంద్రశేఖర్‌యాదవ్, నాయకులు శేషగిరి, రమణారెడ్డి, సురేశ్‌యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి ఉత్తర్వులు

మంత్రికి, కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపిన టీపీఆర్ఎంఏ

వికారాబాద్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ విభాగంలో రాష్ట్రవ్యాప్తంగా 131 మంది సీనియర్ అసిస్టెంట్లకు పర్యవేక్షకులు(సూపరిండెంట్లు)గా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయటం పట్ల తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎ.సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకుల నందకుమార్ హర్షం వ్యక్తం చేశారు. వీరిలో జిల్లాలో ఏడుగురు ఉన్నారు. పదోన్నతులకు సహకారం అందించిన రాష్ట్ర మంత్రి సీతక్క, పంచాయతీరాజ్ డైరెక్టర్ శ్రీజన, అదనపు కమిషనర్ రవీందర్‌రావు, డిప్యూటీ కమిషనర్ విద్యాలత, పదోన్నతుల కమిటీ చైర్మన్ హరికిషన్, ఉన్నతాధికారులు కిషన్‌సింగ్, క్రాంతికుమార్‌లకు శుక్రవారం ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. పదోన్నతుల ప్రక్రియ విజయవంతంగా పూర్తికావడంలో కీలకపాత్ర పోషించిన ఎంపీడీవోలు క్రాంతికిరణ్, శివ, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, ఉదయశ్రీ, గంగాధర్‌లతో పాటు కమిషనర్ కార్యాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రమోషన్ల ఫైళ్లు సిద్ధం చేయడంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనంత్, జిల్లాల, ఉమ్మడి జిల్లాల సీనియర్ సూపరింటెండెంట్లు, సీనియర్/జూనియర్ అసిస్టెంట్లు ఇచ్చిన సూచనలు, సలహాల సహకారం మరువలేమన్నారు. పర్యవేక్షణాధికారులుగా ప్రమోషన్ పొందిన వారిని సంఘం బాధ్యులు అభినందించారు.

విద్యార్థులకు గుడ్లు ఎందుకివ్వడం లేదు?

» ఎస్ఎంసీ చైర్‌పర్సన్ భ్రమరాంబ



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎస్ఎంసీ చైర్‌పర్సన్, తల్లిదండ్రులు

బంట్వారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు గుడ్లు ఇవ్వాలని ఉన్నా ఇక్కడ ఏడాదిగా ఎందుకు ఇవ్వడం లేదని మోడల్ స్కూల్ ఎస్ఎంసీ చైర్‌పర్సన్ భ్రమరాంబ ప్రశ్నించారు. శుక్రవారం బంట్వారం మోడల్ స్కూల్లో పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి విద్యార్థికి భోజనంలో గుడ్డు ఇవ్వాలని, అయితే ఇవ్వడం లేదనే విషయం తనకు చెప్పలేదని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. పాఠశాల అభివృద్ధిలో తమకూ బాధ్యత ఉందని, పర్యవేక్షణ అధికారం ఉంటుందన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. ప్రిన్సిపాల్ బ్యూలా తనను పట్టించుకోవడం లేదన్నారు. స్కూలులో టాయిలెట్స్ క్లీన్‌గా లేవని, డ్యూటీ టైంలో టీచర్లు సెల్‌ఫోన్లు వాడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రిన్సిపాల్ తీరును మార్చుకోవాలని సూచించారు.

ఎస్టీ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

మేడ్చల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్టీ నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్టీ నిరుద్యోగ యువత డీఈఈపీ ఆన్‌లైన్ ప్లాట్ ఫారంలో నమోదు చేసుకోవాలని కోరారు. జనరల్ మేనేజర్ ట్రైకార్, హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ తెలంగాణ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ వారిని ట్రైకార్ కోసం లాగిన్ ఆధారిత డ్యాష్ బోర్డు యాక్సెస్‌ను రూపొందించిదని, అభ్యర్థులు రిజిస్ట్రేషన్‌ను సమర్థంగా ట్రాక్ చేసి పర్యవేక్షించాలని తెలిపారు. అవకాశాన్ని ఎస్టీ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.



రోడ్డుపై ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

మా కాలనీలో మద్యం దుకాణం వద్దు

కీసర రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కాలనీలో మద్యం దుకాణ ఏర్పాటును విరమించుకోవాలని నాగారం మున్సిపల్ సత్యనారాయణ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం మునిసిపాలిటీలోని సత్యనారాయణకాలనీలో ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణం ఏర్పాటుకు వ్యతిరేకంగా కాలనీవాసులు ఆందోళనకు దిగారు. వారికి బీజేపీ నాయకుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సురేష్ మద్దతు తెలిపారు. స్థానికులు రోడ్డుపై బైఠాయించారు. వాహనాలను అడ్డుకున్నారు. మున్సిపల్ కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ.. స్థానికులకు సమస్యాత్మకంగా మారనున్న మద్యం దుకాణ ఏర్పాటును విరమించుకోవాలన్నారు. కాలనీలకు వెళ్లే ప్రధాన రోడ్డులో వైన్స్ ఏర్పాటు చేస్తే ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. ప్రతి శుక్రవారం సంత జరుగుతుందని. దీంతో ట్రాఫిక్ జామ్ అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ అనుమతులు లేకుండా కడుతున్న నిర్మాణంలో మద్యం దుకాణాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణంపై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు నిర్మాణాన్ని అడ్డుకోవాలని, ఇక్కడి వైన్స్‌ను మరోచోటికి తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు వెంకటేశ్వర్లు, సురేందర్‌రెడ్డి, జంగారెడ్డి, నరేష్, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ముప్పు

» త్రుటిలో బయటపడ్డ 28 మంది ప్రయాణికులు



అవుశాపూర్ వద్ద ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి అవుశాపూర్ వద్ద ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం జనగామ డిపో ఆర్టీసీ బస్సు(టీజీ 27 జెడ్0011) 28 మంది ప్రయాణికులతో హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు వస్తోంది. అవుశాపూర్ వద్దకు రాగానే కారు ముందుకు దూసుకొచ్చింది. అప్రమత్తమైన బస్సు డ్రైవర్ బస్సును పక్కకు తిప్పడంతో ఐవే రెయిలింగ్‌ను ఢీకొంది. దీంతో బస్సు అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో ప్రయాణికులు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. త్రుటిలో ముప్పు తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. చివరికి ప్రయాణికులను పోలీసులు మరో బస్సులో గమ్యస్థానాలకు చేర్చారు. జనగామ డిపో మేనేజర్ స్వాతి సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలస్వామి తెలిపారు.

దళితవాడల్లో సమస్యలు.. పరిష్కారంలో నిర్లక్ష్యం

» దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ ఆందోళన

శామీర్‌పేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తూంకుంట మున్సిపల్ పరిధి దేవరయంజాల్‌లోని దళితవాడల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ఏళ్లుగా నిర్లక్ష్యం చేస్తున్నారని దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్.రామ్మోహన్ ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. దేవయంజాల్‌లోని దళితవాడల్లో విద్యుత్ సమస్యలు పరిష్కారం కాక, మౌలిక సదుపాయాలు లేక దళితులు నరకయాతన అనుభవిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. దళితవాడల సమస్యలపై విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. దళిత వాడల్లోని సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ అధికారులను ఆదేశించినా పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంపై దళితులమంతా త్వరలో కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేపడుతామని రామ్మోహన్ తెలిపారు.

చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలి



సైన్స్ సంబరాల్లో పాల్గొన్న జేవీవీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, బుర్హాన్

మేడ్చల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జేవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోట శ్రీనివాస్, ఎస్కే.బుర్హాన్ తెలిపారు. శుక్రవారం మేడ్చల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 236 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8, 9, 10వ తరగతుల్లోని 47,580 విద్యార్థులతో కలిసి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించినట్లు గుర్తుచేశారు. ఆయన మాట్లాడుతూ సైన్స్‌పట్ల, ఆసక్తి, సృజనాత్మకతను, శాస్త్రీయ అవగాహన దృక్పథాన్ని పెంపొందించుకునేందుకు చెకుముకి సైన్స్ దోహదపడుతుందన్నారు. ఈ నెల 21న జరిగే మండలస్థాయి చెకుముకి సంబరాలకు తరగతికి ఒక్కరు చొప్పున పాఠశాల నుంచి ముగ్గురు హాజరై మండలస్థాయి టాలెంట్ టెస్టులో పాల్గొనాలని తెలిపారు.

క్షతగాత్రులకు సాయం అందేదెప్పుడు?

- చేవెళ్ల బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు పరిహారం అందజేసినా గాయపడిన వారికి అందలేదు
- బాధితుల్లో హెడ్ కానిస్టేబుల్, కండక్టర్
- బస్సు ప్రమాదంలో 34 మందికి గాయాలు

తాండూరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల సమీపంలోని మీర్జాగూడ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ముందుగా ప్రకటించిన విధంగా ఆర్థిక సహాయం అందచేసిన ప్రభుత్వం క్షతగాత్రులకు మాత్రం ఇప్పటివరకు ఎలాంటి ఆర్థిక సహాయం అందచేయలేదు. గతనెల 27న ఆర్టీసీ బస్సును కంకర లోడ్‌తో వెళుతున్న టిప్పర్ ఢీకొన్న ఘటనలో బస్సులోని ప్రయాణికుల్లో 19 మంది మృతి చెందగా 34 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రభుత్వం చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో, వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో, పాటు హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించి చికిత్స అందిస్తోంది. ప్రమాదంలో వికారాబాద్ జిల్లాకు చెందిన 13 మంది గాయపడగా వారిలో 8 మంది చేవెళ్ల మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో మండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి వద్ద ఎస్కార్ట్ పైలెట్ విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, మరో కానిస్టేబుల్ కూడా ఉన్నారు. వీరికి పోలీస్ శాఖ నుంచి సాయం అందాల్సి ఉంది. ప్రమాదంలో గాయపడ్డ ఆర్టీసీ బస్సు కండక్టర్ రాధ చేవెళ్ల ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. ఆమెకు ఆర్టీసీ నుంచి కానీ ప్రభుత్వం నుంచి కానీ ఇంత వరకు ఎలాంటి సాయం అందలేదు.

ఎలాంటి పరిహారం ఇవ్వలేదు



మీర్జాగూడ వద్ద జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయాలతో బయటపడ్డాను. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందలేదు. గాయపడిన రోజే తాండూరు జిల్లా ఆస్పత్రిలో వైద్యులు చికిత్స పొందాను. ఇంకా గాయాల తాలూకు నొప్పులతో బాధపడుతున్నాను. నాకు మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వం కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం అందించాలి.

- వినయ్‌కుమార్, గౌతాపూర్, తాండూరు మండలం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర

నవాబుపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర లభిస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం నవాబుపేట మండలంలోని వట్టిమీనపల్లి సమీపంలోని గోదాంలో మార్క్‌ఫెడ్ సౌజన్యంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కోరారు.

అనురాగ్ అధ్యాపకుడికి అంతర్జాతీయ అవార్డు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ అధ్యాపకుడు మేడికొండ ఆశా కిరణ్‌కు అంతర్జాతీ అవార్డు వరించింది. వియత్నాం, హనోయ్‌లోని బ్యాంకింగ్ అకాడమీ ఆఫ్ వియత్నాంలో నిర్వహించిన నైస్-టీస్ ఏషియా - 2025 అంతర్జాతీయ సదస్సులో ఎమర్జింగ్ టెక్ ఇన్నోవేటర్ అవార్డు లభించింది. ఎమర్జింగ్ టెక్నాలజీలో చేసిన విశిష్టమైన సేవలను గుర్తించినందుకుగాను, సాంకేతిక పరిష్కారంలో ప్రభావవంతమైన దోపిడీలను అరికట్టినందుకు ఈ అవార్డు ప్రదానం చేశారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

తాండూరు రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో ప్రశ్నించారు. మీర్జాగూడ రోడ్డు ప్రమాదం అందరినీ కలచివేసిందన్నారు. తాండూరు మండలంలో హైవే పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. కొత్లాపూర్ రోడ్డు పనులు నిదానంగా సాగుతున్నాయన్నారు. రోడ్ల మరమ్మత్తులపై ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రులు స్పందించాలని కోరారు. ఈ నెల 12వ తేదీలోపు అధికారులు, పాలకులు స్పందించకపోతే తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో సడక్ బంద్ తప్పదని హెచ్చరించారు. 20వ తేదీ లోపు సడక్ బంద్ ఎప్పుడైనా చేపడుతామని పేర్కొన్నారు.


కులకచర్ల: ఘనపూర్‌లో వందేమాతరం ఆలపిస్తున్న విద్యార్థులు



కీసర రూరల్: దమ్మాయిగూడలో..


తాండూరు: మున్సిపల్ ఆవరణలో..

వందేమాతరం.. 150వ వసంతం

రచయిత బంకించంద్ర ఛటర్జీకి ఘన నివాళి.. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో గేయాలాపన

వందేమాతర గేయం 150వ వసంతం సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా గేయాలాపన చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది, పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు వందేమాతర గీత రచయిత బంకిం చంద్ర ఛటర్జీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వందేమాతర గీతాన్ని ఆలపించారు. భారత్‌మాతా కీ జై, వందేమాతరం అంటూ నినాదాలు చేస్తూ విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, నవంబరు 7


ఘట్‌కేసర్ రూరల్: వందేమాతరం ఆలపిస్తున్న తహసీల్దారు చంద్రశేఖర్, విద్యార్థులు


బొంరాస్‌పేట్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వందేమాతరం గీతాలాపనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు


కొడంగల్: ఎంపీడీవో కార్యాలయంలో..



పరిగి మునిసిపల్ కార్యాలయంలో..


మోమిన్‌పేట్: ఎంపీడీవో కార్యాలయంలో..

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


పుస్తకాలు చదువుతూ నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

పరిగి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం పరిగిలో విద్యార్థులు పుస్తకాలు చదువుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ, స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కోసం విద్యాసంస్థలు బంద్ పాటిస్తున్నా ప్రభుత్వం స్పందించడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ విధానాలతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు శివ, భానుప్రకాశ్, చరణ్, గణేశ్, నితిన్, భవాని, వైష్ణవి, సంధ్య పాల్గొన్నారు.

చిన్నారులకు రేషన్ అందజేత



యాలాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని హజీపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన చిన్నారులకు శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్, పార్టీ ప్రధాన కార్యదర్శి కృష్ణం ముదిరాజ్, జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్ తదితరులు పరామర్శించారు. చిన్నారులకు నిత్యావసర సరుకులు అందజేశారు.


నిత్యావసర సరుకులు అందించిన సత్యసేవా సమితి సభ్యులు

బాధిత కుటుంబాలకు సరుకుల పంపిణీ

కొడంగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చేవేళ్ల మండలం మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యాలాల్ మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు మృతి చెందారు. తల్లిదండ్రులు మృతి చెందడంతో ఇద్దరు కుమార్తెలు అనాథలయ్యారు. సత్యసాయి సేవా సమితి వికారాబాద్ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యంతోపాటు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎల్లవేళాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సేవా సమితి సభ్యులు వీరేశం, దశరథ్, శివ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

దుద్యాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం దుద్యాల మండలంలోని పోలేపల్లి, చిలుముల్‌మైలారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, వెంకటయ్యాగౌడ్, రాంచంద్రారెడ్డి, మల్లేశ్, జయరాములు, నరసింహ, వెంకట్‌రెడ్డి, చంద్రయ్య, యాదయ్యగౌడ్, రాములు, నర్సిములు యాదవ్, మున్నయ్య, నర్సిములుగౌడ్, నర్సిములు, ఏఈవో జ్యోతి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక


రాష్ట్ర స్థాయికి ఎంపికైన శ్రావణితో ఉపాధ్యాయులు

దోమ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోత్కూర్ ఉన్నత పాఠశాలకు చెందిన శ్రావణి అండర్-17 బాలికల కబడ్డీ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మల్లేశం తెలిపారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.


పాదయాత్రగా వెళ్తున్న అయ్యప్ప స్వాములు

శబరిమలకు అయ్యప్ప స్వాముల పాదయాత్ర

తాండూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాండూరు నుంచి శబరిమలై వరకు అయ్యప్ప స్వాములు చేపట్టిన పాదయాత్రను శుక్రవారం బాలాజీ ఆస్పత్రి ఎండీ డాక్టర్ సంపత్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల నర్సిములు, వరాల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

గెలుపు కోసం ఎంఐఎం నేతల ప్రార్థనలు

కొడంగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీహార్ ఎన్నికల్లో ఎంఐఎం తరపున పోటీ చేస్తున్న 25 మంది అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందాలని పార్టీ కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్కే గుల్షన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక జామే మస్జీద్ వద్ద నిజామ్ షహీద్ దర్గాలో పార్టీ నాయకులతో కలిసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎండీ.సర్తాజ్‌హుసేన్, షేక్ రుమాన్, ఎండీ.అజహర్, ఎండీ.అమేర్‌హుసేన్, తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రోడ్డు విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి

మేడ్చల్ టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి కండ్లకోయ గ్రామం వరకు ఉన్న రోడ్డును వెడల్పు చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక బీజేపీ నాయకులు ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ కిసాన్‌మోర్చ జిల్లా నాయకుడు కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు ఎంపీ నివాసానికి వెళ్లి కలిశారు. జాతీయ రహదారి నుంచి కండ్లకోయ వరకు రోడ్డు ఇరుకుగా మారిందని, వాహనాల రద్దీ పెరిగి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. స్పందించిన ఎంపీ సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యేలా చూస్తానన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

మేడ్చల్ టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు పనుల్లో జరుగుతున్న జాప్యంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని బీజేపీ మేడ్చల్ పట్టణ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ అన్నారు. జాతీయ రహదారిపై పెరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలని కోరుతూ శుక్రవారం స్థానిక నేతలతో కలిసి మేడ్చల్‌లో నిరసన తెలిపి ట్రాఫిక్ పోలీసులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, జాకట ప్రేమ్‌దాస్, మురళీధర్ గుప్తా, సీహెచ్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ నేతల ప్రచారం


జూబ్లీహిల్స్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మేడ్చల్ టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా శుక్రవారం మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. జూబ్లీహిల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పార్టీ అభ్యర్థి విజయం కోసం ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రచారంలో పాల్గొన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌడవెల్లి జగన్ రెడ్డి, భాస్కర్ యాదవ్, నవీన్ రెడ్డి, దయానంద్ యాదవ్, శంకర్ యాదవ్, సత్యనారాయణ రెడ్డి ఉన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలి

కులకచర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన గురుకుల విద్యాసంస్థలు సమస్యల కోరల్లో చిక్కుకునే పరిస్థితి వచ్చిందని ఏఐఎస్ఎఫ్ పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకాశ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని బండవెల్కిచర్ల తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. హాస్టళ్లలోని గదుల్లో లైట్స్ సరిగా లేవని, ఫ్యాన్స్ పని చేడం లేదన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడం లేదని ఆరోపించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్, బయోసైన్స్ మ్యాథ్స్ ఉపాధ్యాయులు, సిబ్బంది కొరత ఉందని పేర్కొన్నారు.

ముదిరాజ్ కుటుంబాలకు అండగా ఉంటాం

దోమ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ కుటుంబాలకు అండగా ఉంటామని ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు చంద్రశేఖర్ ముదిరాజ్ అన్నారు. మండలంలోని బొంపల్లి గ్రామానికి చెందిన బోయిని వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. సంఘం నాయకులతో కలిసి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.9 వేలు ఆర్థికసాయం అందించారు. నాయకులు సురేశ్, యాదయ్య, జంగయ్య, నర్సిములు, కృష్ణయ్య, బాబు, వెంకటయ్య, బుగ్గయ్య, గోపాల్, శ్రీనివాస్, రాములు, ఆంజనేయులు, పెంటయ్య, పుల్లయ్య, రాజు, నవీన్, మొగులయ్య పాల్గొన్నారు.

మౌలాలి రైల్వే స్టేషన్‌కు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలి

ఘట్‌కేసర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మౌలాలి రైల్వేస్టేషన్‌కు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాలగోని వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో మాట్లాడుతూ వరంగల్ జిల్లా ఖిలాషాపూర్‌ను రాజధానిగా ప్రజలకు ఎలాంటి కష్టాలు లేని పాలన అందించిన మహనీయుడు సర్వాయి పాపన్న అని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి తక్షణసాయం

కులకచర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మృతుడి అంత్యక్రియలకు తోటి మిత్రులు ఆర్థికసాయం అందించారు. మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన బసత్కర్ దత్తాత్రేయ శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 2003-04 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు స్పందించారు. గ్రామానికి వెళ్లి మృతుడి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులకు రూ.18 వేలు ఆర్థికసాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వివాహ వేడుకకు జాగృతి అధ్యక్షురాలు


ఆర్పీఎల్‌వో సీఈవో శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో పెళ్లి వేడుకల్లో జాగృతి మహిళా అధ్యక్షురాలు కవిత

తాండూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపారవేత్త ఆర్పీఎల్‌వో సీఈవో శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు బ్రిజేష్‌రెడ్డి వివాహం శనివారం జరగనుంది. శుక్రవారం వారి ఇంటికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెళ్లి పెళ్లి కుమారుడిని ఆశీర్వాదించారు.

సందడిగా ల్యూమినా 2025 ఫెస్ట్

ఘట్‌కేసర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని రాక్‌వుడ్స్ ఇంటర్‌నేషనల్ స్కూల్ సీఈఓ సుబ్రమణ్యం రంగినేని అన్నారు. శుక్రవారం పోచారం మున్సిపాలిటీ యంనంపేట్‌లోని పాఠశాలలో ల్యూమినా 2025 అకడమిక్ ఫెస్ట్‌ను ప్రారంభించారు. డ్యామ్ ప్రాజెక్టు, రోబోరీచ్, బ్రిడ్జింగ్ ది గ్యాప్ అనే స్మార్ట్ రోబో, స్మార్ట్ స్ట్రీట్ లైట్ సిస్టమ్, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న సీఈఓ సుబ్రమణ్యం


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సీసీ రోడ్లు వేయాలి

శామీర్‌పేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల స్థానంలో కొత్తగా సీసీ రోడ్లు నిర్మించాలని తూంకుంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు ఎద్దు నాగేష్‌యాదవ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జ్యోతిని కలసి వినతిపత్రం అందజేశారు. తూంకుంట పరిధిలో ప్రధాన రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్‌గౌడ్, జైపాల్ రెడ్డి, చీరాల గిరి, కత్తి రమేశ్ పాల్గొన్నారు.

పేదలకు కాంగ్రెస్‌తోనే మేలు

దుద్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదలకు కాంగ్రెస్‌తోనే మేలు జరుగుతుందని ఎస్టీ సెల్ దుద్యాల మండల అధ్యక్షుడు రవి నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో అభయ హస్తం ఆరు కిలోల సన్న బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొగులయ్య, పెంటప్ప, లాల్యానాయక్, రతన్‌నాయక్, డీలర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.